సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

97053 47483

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

నిషేధిత ప్లాస్టిక్ విక్రయిస్తే చర్యలు



దుకాణం వద్ద పాలిథిన్ కవర్లు పరిశీలిస్తున్న జెడ్సీ ఫణిరాం

ఆరిలోవ: నిషేధిత ప్లాస్టిక్ కవర్లు, వస్తువులు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీవీఎంసీ జోన్–2 జోనల్ కమిషనర్ ఎం.వి.డి. ఫణిరాం హెచ్చరించారు. తొమ్మిదో వార్డు పరిధి విశాలాక్షినగర్ కైలాసగిరి కూడలిలో షాపులను ఆయన శుక్రవారం తనిఖీ చేశారు. అక్కడ టిఫిన్ సెంటర్లు, కిరాణా షాపులలో పాలిథిన్ కవర్లు పరిశీలించారు. టీ షాపుల్లో పేపర్ కప్పుల్లో టీ విక్రయించకూడదని సూచించారు. అలాంటి కప్పులు వినియోగించేవారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. పేపరు కప్పుల్లో టీ తాగడం ఆరోగ్యానికి మంచిది కాదని వినియోగదారులకు సూచించారు. ఈ తనిఖీలలో సచివాలయ సిబ్బంది, పారిశుధ్య సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి వైద్య పరీక్షలు



విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ సెక్టార్–10లోని సమత డిగ్రీ, పీజీ కాలేజీలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్, సంధ్య నేత్ర వైద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం ఉచిత నేత్రవైద్య శిబిరాన్ని నిర్వహించారు. కళాశాల కరస్పాండెంట్ విజయరవీంద్ర శిబిరాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు సంధ్య నేత్ర వైద్యాలయం సీనియర్ ఆప్టీషియన్ డాక్టర్ పి.అమృతరాజ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందజేశారు. కార్యక్రమంలో పలువురు డాక్టర్లు పాల్గొన్నారు.

దొరకని బాలుర ఆచూకీ

ఎంవీపీకాలనీ: ఇటీవల అదృశ్యమైన నక్కవానిపాలెంకు చెందిన చాట్ల ధీరజ్(13), చైతన్యనగర్‌కు చెందిన దత్తి యశ్వంత్ (14) ఆచూకీ ఇంకా లభించలేదని ఎంవీపీ పోలీసులు వెల్లడించారు. ఒకే స్కూల్‌కు చెందిన ఆ ఇద్దరు బాలురు అదృశ్యం కావడంపై తల్లిదండ్రులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎంవీపీ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న విషయం తెలిసిందే. అయితే వారు హైదరాబాద్ చేరినట్లు సీసీ టీవీ ద్వారా గుర్తించినట్లు ఎంవీపీ పోలీసులు వెల్లడించారు. అయితే, వారు సిటీలో ఎక్కడికి వెళ్లారనే ఆచూకీ ఇంకా లభించలేదన్నారు. ఈ నేపథ్యంలో మరో కానిస్టేబుల్‌ను సైతం దర్యాప్తు కోసం హైదరాబాద్ పంపించినట్లు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో 'బైక్ రెంటల్స్' ప్రారంభం



రైల్వేస్టేషన్‌లో బైక్ రెంటల్స్ కార్యాలయం ప్రారంభిస్తున్న అతిథులు

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో వివిధ ప్రాంతాల నుంచి వచ్చే ప్రయాణికులు, సందర్శకుల సౌకర్యార్థం బైక్ రెంటల్స్‌ను శుక్రవారం ప్రారంభించారు. రాధాకృష్ణ ఎంటర్‌ప్రైజస్ అధినేత కె. వంశీ మాట్లాడుతూ విశాఖకు రైలు మార్గం ద్వారా ప్రతిరోజు వందలాది మంది వివిధ పనుల నిమిత్తం వస్తుంటారని, వీరిలో కొందరు ఉదయం వచ్చి పనులు చూసుకుని సాయంత్రం, లేదా రాత్రికి తిరిగి వెళ్లిపోవాలనుకుంటారన్నారు. వారి సౌకర్యార్థం విశాఖ రైల్వే స్టేషన్‌లో గేట్ నెంబర్ –1,3ల వద్ద బైక్ రెంటల్స్‌ను ప్రారంభించినట్లు తెలిపారు.

సాక్షి

మీరు సాక్షి చందాదారులుగా చేరదలుచుకున్నారా!
లేదా మీకు పేపరు అందటంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయా!
సంప్రదించవలసిన నెంబరు
వైజాగ్ ఈస్ట్
✆ 7331119904, 9912440606

భయం భయం..



గోడలను చీల్చుకు వస్తున్న మొక్కలు





శిథిలమైన భవంతి



కూలిపోయేందుకు సిద్ధంగా ఉన్న మెట్లు



పగుళ్లిచ్చిన గోడలు

బీచ్‌రోడ్డు:

ప్రజలకు రక్షణ కల్పిస్తున్న రక్షకులకే రక్షణ లేదు.. వారు విధులు నిర్వర్తిస్తున్న భవనం ఎప్పుడు కూలిపోతుందో తెలియని పరిస్థితిల్లో భయంగా భయంగా సేవలందిస్తున్నారు. ప్రజలు కూడా రక్షణ కోసం అక్కడికి వెళ్లాలంటే ఎటు నుంచి ఏ ప్రమాదం వచ్చి పడుతుందో అని బిక్కుబిక్కుమంటూ లోపలికి వెళ్తున్నారు.. అదే నగరంలో ఎంతో ప్రతిష్ఠాత్మకమైన మూడో పట్టణ పోలీసు స్టేషన్. స్టేషన్ మొత్తం శిథిలావస్థకు చేరింది. గోడలు ఎక్కడికక్కడ పగుళ్లిచ్చాయి. పెద్ద పెద్ద మొక్కలు గోడలను చీల్చుకుంటు వస్తున్నాయి. ఆ భవనం ఏ క్షణంలో కూలిపోతుందో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో పోలీసులు స్టేషన్‌లో విధులు నిర్వర్తించాలంటే భయపడుతున్నారు. ఇక వర్షాకాలంలో అయితే చెప్పనే అక్కర్లేదు.

మరమ్మతులకు సీపీ ఆదేశం..

నాలుగు నెలల కిందట మూడో పట్టణ పోలీసు స్టేషన్ భవనం పరిస్థితిపై ఆరా తీసిన పోలీసు కమిషనర్ బాగ్చీ వారం రోజుల్లో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. దీంతో అప్పటి సీఐ పార్థసారథి మరమ్మతుల అంచనా వ్యయం కోసం కాంట్రాక్టర్‌ను రప్పించారు. ఆయన వచ్చి స్టేషన్ మొత్తం పరిశీలించి అంచనా వేసి సీఐకు తెలిపారు. వారం రోజుల్లో పనులు ప్రారంభించాలని అనుకున్నారు. అయితే ఏం జరిగిందో తెలియదు కానీ పనుల్లో ఎటువంటి కదలిక రాలేదు.

ఇప్పటికీ శిథిలావస్థల్లోనే..

పోలీసు కమిషనర్ స్వయంగా వారం రోజుల్లో మరమ్మతులు చేపట్టాలని ఆదేశించటంతో సిబ్బంది అంతా ఎంతో ఆనందం వ్యక్తం చేశారు. నిర్భయంగా విధులకు హాజరు కావచ్చు అనుకున్నారు. అయితే సీపీ ఆదేశించి నెలలు గడుస్తున్నా మరమ్మతు పనులు జరగలేదు. దీంతో సిబ్బంది ఆనందం ఆవిరయింది.

స్టేషన్‌లోకి వెళ్లేందుకు భయంభయం..

మూడో పట్టణ పోలీసు స్టేషన్ భవనంలో ఆ స్టేషన్‌తో పాటు ద్వారక ఏసీపీ కార్యాలయం.. ఎంవీపీ క్రైమ్, ట్రాఫిక్ పోలీసు స్టేషన్లు ఉన్నాయి. దీంతో నిరంతరం అనేక మంది తమ సమస్యలు చెప్పుకునేందుకు ఈ కార్యాలయాలకు వస్తుంటారు. అయితే ఈ భవనం ఎటు చూసినా పగుళ్లు, పెద్ద పెద్ద రంధ్రలతో ఉండటంతో ప్రజలు లోపలికి వెళ్లేందుకు భయపడుతున్నారు. ఎప్పుడు ఏ గోడ కూలిపోతుందో తెలియని పరిస్థితిల్లో ఉండటంతో వీలైనంత వేగంగా అక్కడి నుంచి వెళ్లిపోయేందుకు ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలో స్టేషన్‌కు మరమ్మతులు చేపట్టి పోలీసులు, ప్రజలకు భరోసా కల్పించాలని కోరుతున్నారు.

రంగోత్సవ్ పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ఎస్ఎస్ఏ డైరెక్టర్ నాగేశ్వరరావు నుంచి పురస్కారం అందుకుంటున్న ఆరిపాక విద్యార్థులు

భీమునిపట్నం/సబ్బవరం: విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి రంగోత్సవ్ పోటీల్లో ఉమ్మడి విశాఖకు చెందిన విద్యార్థులు ప్రతిభ చూపారు. డిజిటల్ కళాశాల కేటగిరీలో పెదగంట్యాడ మండలం నడుపూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ఎస్.చరణ్‌రాజ్, రంగోలి పోటీల్లో భీమిలి కేజీబీవీకి చెందిన కె.ఉమాదేవి, కె.జ్యోత్స్న, స్లోగన్ రైటింగ్ పోటీలో పద్మనాభం కేజీబీవీకి చెందిన కె.సుప్రియ, రోల్‌ప్లే పోటీలో సబ్బవరం మండలం ఆరిపాక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థులు ద్వితీయ స్థానాల్లో నిలిచారు.

ఆకట్టుకున్న 'భువన విజయం'

ఆరిపాక ఆంగ్ల ఉపాధ్యాయురాలు బి.వి.రామలక్ష్మి రచించిన 'భువన విజయం' అనే నాటకాన్ని 9వ తరగతి విద్యార్థినులు ఎ.ఉమాదేవి, జె.దివ్యధరణి, పి.ఇందువదన చక్కగా ప్రదర్శించారు. సర్వ శిక్ష అభియాన్ రాష్ట్ర ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగేశ్వరరావు చేతుల మీదుగా విజేతలు పురస్కారం, ప్రశంసా పత్రం స్వీకరించారు. విజేతలను భీమిలి జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ ఎం.జ్యోతి కుమారి అభినందించారు.

నిల్వ మాంసం పట్టివేత



స్వాధీనం చేసుకున్న కవా పుల్లలు



హనుమంతవాక వద్ద షాపులో నిల్వ ఉంచిన మాంసం పట్టుకున్న శానిటరీ సిబ్బంది

ఆరిలోవ: జీవీఎంసీ తొమ్మిదో వార్డు పరిధి హనుమంతవాక వద్ద మాంసం దుకాణాల్లో శానిటరీ ఇన్‌స్పెక్టర్ చిన్నాజీ శుక్రవారం తనిఖీలు చేపట్టారు. ఇక్కడ మద్యం షాపు పక్కన మందుబాబులకు విక్రయించే ఓ షాపులో కవాపుల్లలు, ఓ మాంసం దుకాణంలో నిల్వ ఉంచిన మాంసం స్వాధీనం చేసుకున్నారు. వారికి రూ.3,000 జరిమానా విధించారు. ఆ మాంసాన్ని డంపింగ్‌యార్డుకు తరలించామని చిన్నాజీ తెలిపారు.

తాండ్ర పాపారాయుడికి నివాళులు



తాండ్ర పాపారాయుడి విగ్రహం వద్ద నివాళులు అర్పిస్తున్న వెలమ సంక్షేమ సంఘం సభ్యులు

ఆరిలోవ: బొబ్బిలియుద్ధంలో తాండ్ర పాపారాయుడు చూపిన పోరాట పటిమ మరువలేనిదని ఆంధ్రప్రదేశ్ వెలమ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు లగుడు గోవిందరావు అన్నారు. తాండ్ర పాపారాయుడు వర్ధంతిని పురస్కరించుకుని బీచ్ రోడ్డులోని ఆయన విగ్రహానికి వెలమ సంక్షేమ సంఘం సభ్యులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా గోవిందరావు మాట్లాడుతూ 1757 జనవరి 24న బొబ్బిలి రాజుల సైన్యానికి, ఫ్రెంచి, విజయనగర ఉమ్మడి సైన్యానికి మధ్య జరిగిన యుద్ధంలో తాండ్ర పాపారాయుడు వీరమరణం పొందారన్నారు. అలాంటి మహావీరుడి స్మృతి వనాన్ని రాష్ట్ర ప్రభుత్వం విశాఖలో ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పెదిరెడ్ల సత్యం, బర్ల పైడంనాయుడు, అల్లు శంకరరావు, శేషగిరిరావు, సతీష్ రోమిణి, లక్ష్మి పాల్గొన్నారు.

నైతిక విలువలతోనే మెరుగైన సమాజం

హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ కృపాసాగర్



విద్యార్థినులకు బహుమతులను అందజేస్తున్న న్యాయమూర్తి డాక్టర్ కృపాసాగర్

విశాఖ విద్య: నీతివంతమైన జీవితంతోనే మానవ మనుగడ ముడిపడి ఉంటుందని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి డాక్టర్ వి.ఆర్.కె.కృపాసాగర్ అన్నారు. నైతిక విలువలతోనే మెరుగైన సమాజం సాకారమవుతుందన్నారు. ఏయూ తత్వశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో అంబేడ్కర్ అసెంబ్లీ హాల్లో శుక్రవారం నిర్వహించిన 17వ అంతర్జాతీయ సామాజిక తత్వశాస్త్ర సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడారు. నైతిక విలువల ఆవశ్యకతను మానవ సమాజం మరవకూడదన్నారు.

తాత్విక ఆలోచనలతోనే సమస్యల పరిష్కారం

డాక్టర్ కూటికుప్పల సూర్యారావు మాట్లాడుతూ మానవ సమాజం ఎదుర్కొంటున్న సమస్యలకు తాత్విక ఆలోచనలతోనే పరిష్కారం లభిస్తుందన్నారు. ఆచార్య కూటికుప్పల సూర్యారావు ఎండోమెంట్ పురస్కారాన్ని అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ రాఘవేంద్రకు, బెంగళూరు విశ్వవిద్యాలయం డాక్టర్ మాయ నీహ సిల్లాంగ్‌కు అందజేశారు. చదువులో ప్రతిభ కనబరిచిన హైస్కూల్ విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కార్యనిర్వాహక కార్యదర్శి ఆచార్య వానపల్లి వెంకటరావు, అంతర్జాతీయ యోగ, తత్వశాస్త్ర సదస్సు వ్యవస్థాపక అధ్యక్షుడు ఆచార్య బసవరాజు, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య నరసింహారావు, బెంగళూరు విశ్వవిద్యాలయ ఆచార్యులు పాట్టి రాజు, జయపూర్ విశ్వవిద్యాలయ ఆచార్యులు సంజీవ్ బాణావత్, యోగ కాన్షస్‌నెస్ ట్రస్ట్ విజినిగిరి ఆచార్యులు డాక్టర్ నరసింహారావు, రాయచూర్ బసవస్వామి విశ్వవిద్యాలయ ఆచార్యులు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేటి నుంచి చాగంటి ప్రవచనాలు

మధురవాడ గాయత్రి ఇంజినీరింగ్ కళాశాలలో నిర్వహణ



ప్రవచనాల కరపత్రం ఆవిష్కరిస్తున్న చాగంటి కుమారుడు షణ్ముఖ చరణ్ తదితరులు

మధురవాడ: సంపూర్ణ రామాయణంపై ప్రముఖ ప్రవచన కర్త, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. మధురవాడ గాయత్రి మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో మార్చి 6వ తేదీ వరకు 42 రోజులు ఈ ప్రవచనాలు ఉంటాయని ఆయన కుమారుడు షణ్ముఖ చరణ్, గాయత్రీ విద్యా పరిషత్ కార్యదర్శి సోమరాజు, అష్టలక్ష్మి ఆలయం ధర్మకర్త అన్నంరాజు సత్యనారాయణ వెల్లడించారు. కళాశాలలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు ప్రవచనాల కరపత్రం ఆవిష్కరించి మాట్లాడారు. వాల్మీకి రామాయణంలో ఆరు ఖండాలను, ఒక్కో ఖండంపై వారం రోజుల పాటు చాగంటి ప్రవచిస్తారని వివరించారు. శ్రీ అష్టలక్ష్మి, వైశాఖేశ్వర స్వామి ఆలయం, గాయత్రీ విద్యా పరిషత్ సంయుక్త ఆధ్వర్యంలో ధర్మవర్ధిని సహకారంతో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రతి రోజూ సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు ప్రవచనాలు ఉంటాయని, సుందరాకాండ, సీతా రాముల కల్యాణం, పట్టాభిషేకం తదితర ముఖ్య ఘట్టాల సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. ఆలయాల్లో పూజలు నిర్వహించిన రామయంత్రం ఇప్పటికే ఇక్కడ చేరుకుందని, ప్రవచనాలతో పాటు రామయంత్రం దర్శన ఏర్పాట్లు చేశామన్నారు. రామాయణం అన్ని రకాల ఒత్తిడులకు పరిష్కారమని, యువతీ యువకులకు వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడుతుందన్నారు. గాయత్రీ మహిళా ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ గోస్వామి, వైస్ ప్రిన్సిపాల్ జి. సుధీర్ తదితరులు పాల్గొన్నారు.

బాలికల సాధికారతే లక్ష్యం



చిత్రలేఖన పోటీల్లో పాల్గొన్న బాలికలు



ప్రతిభ చూపిన విద్యార్థినులతో ఆచార్య పల్లవి తదితరులు



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

ఆరిలోవ: బాలికల సాధికారతే లక్ష్యంగా అందరూ సహకారం అందించాలని సైబర్ విభాగం సీఐ టి.కల్యాణి అన్నారు. వారిని అన్ని రంగాల్లో ప్రోత్సహిస్తూ, ఆర్థిక స్వావలంబన సాధించేందుకు తోడ్పాటునందించాలన్నారు. జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా విశాలాక్షినగర్ బీవీకే ఉన్నత పాఠశాలలో జేసీఐ విశాఖ నైట్స్ ఆధ్వర్యంలో సేవ్ ద గర్ల్ చైల్డ్ పేరుతో శుక్రవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. బాలికల రక్షణ, వారి హక్కులు, బాధ్యతలు, లింగ సమానత్వం తదితర అంశాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 50 మంది బాలికలకు చిత్రలేఖనం, వక్తృత్వ పోటీలు నిర్వహించారు. ఆయా పోటీలలో బాలికలు ఉత్సాహంగా పాల్గొని, తమ ప్రతిభ కనబరిచారు. నిర్వాహకులు విజేతలను ఎంపిక చేశారు. కార్యక్రమంలో నిర్వాహక సంస్థ మహిళా విభాగం చైర్‌పర్సన్ జె.ఎఫ్.ఎం.కాళిక, డైరెక్టర్ జేసీ సాయిలక్ష్మి, లక్ష్మి, బీవీకే పాఠశాల ప్రిన్సిపాల్ మాధురి పాల్గొన్నారు.

ఏయూలో జాతీయ బాలికా దినోత్సవం

విశాఖ విద్య: జాతీయ బాలికా దినోత్సవం (నేషనల్ గర్ల్ చైల్డ్ డే)ను శుక్రవారం ఆంధ్ర విశ్వవిద్యాలయంలో ఘనంగా నిర్వహించారు. డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ విమెన్ స్టడీస్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఏయూ ఇంగ్లిష్, తెలుగు మీడియం పాఠశాలల్లో 6 నుండి పదవ తరగతి వరకు చదువుతున్న విద్యార్థినులకు వారు కనబరిచిన ప్రతిభ ఆధారంగా సర్టిఫికెట్ ఫోల్డర్లు ప్రోత్సాహకరంగా అందించారు. అంబేడ్కర్ అసెంబ్లీ సమావేశ మందిరంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో హైకోర్ట్ జడ్జి డాక్టర్ వి.ఆర్.కె.కృపాసాగర్, పద్మశ్రీ అవార్డు గ్రహీత డాక్టర్ కూటికుప్పల సూర్యారావు, ఆచార్య బసవరాజ్ సిద్ధాశ్రమ, ఏయూ ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ.నరసింహారావు, డాక్టర్ దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ సెంటర్ ఫర్ విమెన్ స్టడీస్ డైరెక్టర్ ఆచార్య ఎ.పల్లవి తదితరులు పాల్గొన్నారు.

బాలికా విద్యతో బంగారు భవిష్యత్

మహారాణిపేట: జాతీయ బాలికా దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నగరంలో ర్యాలీ నిర్వహించారు. రేసవానిపాలెంలోని డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి మొదలైన ర్యాలీ సత్యం కూడలి మీదుగా తిరిగి డీఎంహెచ్‌వో కార్యాలయానికి చేరుకుంది. ఈ ర్యాలీని డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బేటీ బచావో బేటీ పడావో అన్న నినాదంతో అందరూ పని చేయాలన్నారు. ఎక్కడా లింగభేదం ఉండరాదన్నారు. బాలికలు చదువుకోవడం వల్ల ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. అలాగే కుటుంబాన్ని అభివృద్ధి పథంలో నడిపించడానికి వీలు కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా మీడియా విస్తరణాధికారి (డెమో) ఎం.నాగేశ్వరరావు, ఇతర వైద్య విభాగాల పర్యవేక్షకులు, వివిధ శాఖల అధికారులు, జిల్లా ప్రోగ్రాం అధికారులు, కార్యాలయ సిబ్బంది, రీజినల్ ట్రైనింగ్ సెంటర్ నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకుందాం



ఏబీవీపీ క్యాలెండర్ ఆవిష్కరిస్తున్న ప్రతినిధులు

- మాజీ క్రికెటర్ అంబటి రాయుడు
- ప్రారంభమైన ఏబీవీపీ రాష్ట్ర మహా సభలు



నేతలకు అంజలి ఘటిస్తున్న ముఖ్య అతిథులు

విశాఖ విద్య: ప్రశ్నించే తత్వాన్ని ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకోవాలని భారత మాజీ క్రికెటర్ అంబటి తిరుపతి రాయుడు అన్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో శుక్రవారం ఏబీవీపీ 43వ రాష్ట్ర మహాసభలు ప్రారంభమయ్యాయి. ఈ సభలో పాల్గొన్న రాయుడు మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడటం అలవాటు చేసుకోవాలని సూచించారు. మాజీ ఎమ్మెల్సీ పి.వి.ఎన్ మాధవ్ మాట్లాడుతూ ఏబీవీపీ కార్యకర్తగా ఉన్న రోజులను గుర్తుచేసుకున్నారు. క్రమశిక్షణతో ముందుకు సాగే వారికి తప్పనిసరిగా గుర్తింపు ఉంటుందన్నారు. కాంటినెంటల్ కాఫీ సంస్థ అధినేత చల్లా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ కొంతకాలంగా భారతదేశ వ్యాపారవేత్తలకు ప్రపంచవ్యాప్తంగా మంచి గుర్తింపు లభిస్తోందని, యువత ఉద్యోగం కోసం ఎదురు చూడకుండా వ్యాపారవేత్తలుగా ఎదగాలని సూచించారు. ఉద్యోగాలు సృష్టించే వ్యక్తులుగా గుర్తింపు పొందాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఏబీవీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వీరేంద్ర సోలంకి, రాష్ట్ర కార్యదర్శి యాగంటి గోపి, రఘు విద్యాసంస్థల అధినేత కె. రఘు తదితరులు పాల్గొన్నారు.

నేడు శోభాయాత్ర

రాష్ట్ర మహాసభల్లో భాగంగా శనివారం సాయంత్రం 4 గంటలకు ఏబీవీపీ శోభాయాత్ర నిర్వహించనున్నారు. ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ మైదానం నుంచి రామాటాకీస్ మీదుగా, ఆర్టీసీ కాంప్లెక్స్, ఎల్ఐసీ బిల్డింగ్, వుమెన్స్ కాలేజీ మీదుగా సెంట్రల్ పార్క్ వరకు సాగుతుందని ఏబీవీపీ ప్రతినిధులు తెలిపారు.

పర్యాటక కేంద్రాల్లో సదుపాయాలు కల్పించాలి



హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న వీఎంఆర్డీఏ కమిషనర్ విశ్వనాథన్

విశాఖ సిటీ: వీఎంఆర్డీఏకు చెందిన పర్యాటక కేంద్రాల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించాలని మెట్రోపాలిటన్ కమిషనర్ కె.ఎస్.విశ్వనాథన్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం వీఎంఆర్డీఏ నిర్వహణలో ఉన్న పర్యాటక ప్రదేశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. టీయూ 142, సీ హ్యారియర్ మ్యూజియాలను సందర్శించి అక్కడి పరిస్థితులను పరిశీలించారు. పర్యాటకుల సౌకర్యార్థం సదుపాయాలు కల్పించాలని చెప్పారు. అసంపూర్తిగా ఉన్న పనులను సత్వరమే పూర్తి చేయాలని, పాడైన లైట్లను పునరుద్ధరించాలని, అదనపు టాయిలెట్లు ఏర్పాటుకు అంచనాలను రూపొందించాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. పార్క్ సందర్శనార్థం వచ్చిన స్కూల్ పిల్లలు, అధ్యాపకులతో ముచ్చటించి పార్క్‌లో కల్పించిన వసతుల కోసం ఆరా తీశారు. అదేవిధంగా టీయూ యుద్ధ విమాన మ్యూజియం ఎయిర్ కండిషనింగ్ వ్యవస్థ సమర్థవంతంగా పని చేసేలా చూడాలన్నారు. యూహెచ్3హెచ్ యుద్ధ హెలికాప్టర్ మ్యూజియం నిర్మాణ పనులను ఈ నెల 30వ తేదీ నాటికి పూర్తి చేసి ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని అధికారులకు చెప్పారు. తాటిచెట్లపాలెం కల్యాణమండపం నిర్వహణకు త్వరగా టెండర్లు పిలిచి వినియోగంలోకి తీసుకువస్తామని తెలిపారు. ఈ పర్యటనలో వీఎంఆర్డీఏ సీఈ భవానీశంకర్, కార్యనిర్వాహక ఇంజినీర్లు రాజు, రామరాజు, డీఎఫ్‌వో శివాని పాల్గొన్నారు.

మేరా భారత్ మహాన్



స్వాతంత్ర్య సమరయోధుల వేషధారణలో చిన్నారులు కనువిందు చేశారు. గణతంత్ర దినోత్సవం సందర్భంగా బీచ్‌రోడ్డులోని ఓ నర్సరీ స్కూల్‌కు చెందిన విద్యార్థులు ఇలా సందడి చేశారు.

ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

రక్తదాన శిబిరం రేపు

మురళీనగర్: మురళీనగర్ సెక్టార్–3లోని ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు, విశాఖ వివేకానంద యువ మహామండలి ఆధ్వర్యంలో వివేకానందుడి 162వ జయంతి సందర్భంగా 23వ స్వచ్ఛంద రక్తదాన శిబిరం ఆదివారం నిర్వహించనున్నట్లు ప్రశాంతి ఆధ్యాత్మిక పార్కు ఉపాధ్యక్షుడు జీవీ రత్నం, వీవీవైఎం ప్రతినిధులు ఒక ప్రకటనలో తెలిపారు.